## కథ

# దాగుడు మూతలు

**వాణిశ్రీ**

భావనారాయణ వాకింగ్ నుంచి ఇంటికి వచ్చేసరికి రుక్మిణి వంటగదిలో ఉంది. మిక్సీలో పెసరపిండి వేస్తోంది.

“ఏంటి ఇంకా రెడీ కాలేదా?” అడిగాడు.

“ఇప్పటివరకు కరెంటు లేదు. ఇప్పుడు వచ్చింది” చెప్పింది రుక్మిణి.

“నేను స్నానం చేసి వస్తాను. ఈ లోపల నువ్వు టిఫిన్ తినెయ్యి” అన్నాడు.

“ముందు మీరు స్నానం చేసి రండి. ఇద్దరం కలిసి తిందాం” అన్నది రుక్మిణి.

“అలా కాదు. అరుణ వచ్చాక ఇద్దరం తింటాం” అని వెళ్లిపోయాడు.

రుక్మిణి ముఖం మాడ్చుకుంది. ఆమె ముఖం రంగులు మారడం అతను గమనించాడు.

భావనారాయణ స్నానం చేసి వచ్చేటప్పటికి రుక్మిణి తన లగేజి సర్దుకుని రెడీగా ఉంది. కానీ ఆమె ముభావంగా ఉంది.

“టిఫిన్ చేశావా?” అడిగాడు.

“ఊ..” అన్నది.

కానీ అతను గ్రహించాడు. రుక్మిణి టిఫిన్ తినలేదు. ఆమె నేతితో పెసరట్టు వేసిందంటే ఇల్లంతా ఘుమఘుమలాడుతుంది. ఆమె బాధపడుతోందని అతనికి తెలుసు. తనేం చేయగలడు? రుక్మిణితో తనకున్న సంబంధం అరుణకు తెలియగూడదు. తెలిస్తే అరుణ పసి మనసు గాయపడుతుంది. చదువు మీద శ్రద్ధ వహించలేదు.

అరుణ హాస్టల్లో చదువుకుంటోంది. తల్లి చనిపోయిన తరువాత ఆమెను హాస్టల్లో చేర్పించాడు భావనారాయణ. ప్రతి ఆదివారం ఇంటికి తీసుకొస్తాడు. ఇక ఆ రోజంతా కూతురితో గడుపుతాడు.

ఆ రోజు ఆదివారం. అరుణను హాస్టల్ నుంచి తీసుకుని రావాలి. అరుణ వచ్చే సమయానికి రుక్మిణి కనిపించగూడదు.

“కోపం వచ్చిందా?” ఆమె భుజం చుట్టూ చేతులు వేసి అడిగాడు భావనారాయణ.

ఆమె మాట్లాడలేదు.

“సరే! పెసరట్లు వెయ్యి. ఇద్దరం తిందాం. నాకు మాత్రం ఒక్కటే చాలు. మళ్లీ అరుణతోపాటు తినాలి గదా!” నవ్వుతూ అన్నాడు.

రుక్మిణి వంటగదిలోకి వెళ్లింది. కాసేపటికి పెసరట్టు నేతితో కాల్చిన వాసన భావనారాయణ ముక్కుపుటాలకు తగిలింది. అతని నోట్లో నీళ్లూరాయి.

భావనారాయణకి అల్లం, పచ్చిమిరపకాయలు, జీలకర్ర వేసి నేతితో కాల్చిన పెసరట్లంటే ఎంతో ఇష్టం. అరుణకు కూడా అంతే. కూతురు వచ్చే సమయానికి రుక్మిణితో పెసరపిండి రెడీ చేయిస్తాడు. ఆమె వెళ్లిపోతుంది. అరుణ ఇంటికి వచ్చిన తరువాత పనిమనిషి సీత పెసరట్లు వేసి పెడుతుంది. ఎంతో రుచిగా ఉన్నాయని సీతని మెచ్చుకుంటుంది అరుణ. సీత నవ్వుకుంటుంది.

○○○

శనివారం సాయంకాలం భావనారాయణ ఆఫీసు నుంచి బయల్దేరబోతున్నాడు.

సెల్ రింగైంది.

అరుణ ఫోన్ చేసింది.

“డాడీ! రేపు నా కోసం రావొద్దు” అన్నది.

“ఏం?”

“వార్డెన్ ఎవర్నీ హాస్టల్ వదిలి వెళ్లొద్దన్నది. ఈ ఇయర్ పబ్లిక్ ఎగ్జామ్స్ ఉంటాయి గదా! స్పెషల్ క్లాసులు ఉన్నాయేమో?” చెప్పింది అరుణ.

“పోనీ ఈవెనింగ్ రానా? సండే నైట్ ఉండి, మండే మార్నింగ్ వెళ్లొచ్చుగదా?” అన్నాడు భావనారాయణ.

“వద్దులే డాడీ! నైట్ స్టడీస్ ఉంటాయేమో?”

“సరే! నీ ఇష్టం.” అన్నాడు.

“బై..డాడీ!”

భావనారాయణ రుక్మిణితో చెప్పాడు. “రేపు ఆదివారం అరుణ రావడం లేదు.”

“ఏం?”

“ఈ సంవత్సరం పబ్లిక్ ఎగ్జామ్స్ గదా! స్పెషల్ క్లాసులు పెట్టి ఉంటారు. వార్డెన్ ఎవర్నీ హాస్టల్ వదిలి వెళ్లొద్దని చెప్పిందట”

“ఏమండీ! నాకు లుంబిని పార్కు చూడాలని ఉందండీ! మామూలు రోజుల్లో మీకు తీరుబడి ఉండదు. ఆదివారం కూతురుతో గడుపుతారు. రేపు ఆదివారం మీ అమ్మాయి ఎటూ రావడం లేదుగా!” అన్నది రుక్మిణి.

“పార్కులో ఏం చూస్తావు? కావాలంటే ఏదైనా సినిమాకి తీసుకెళ్తాలే”

“అక్కడ లేజర్‌షో ఎంతో బాగుంటుందట”

“పార్కుకి చాలామంది జనం వస్తుంటారు. మనల్ని ఎవరైనా చూస్తారేమో”

“ఏం చూస్తే?”

“ఏం లేదు. అరుణకు చెప్తారేమోనని...”

“సినిమాకెళ్తే మాత్రం ఎవరైనా చూడరా?”

“ఛాన్స్ తక్కువ” నవ్వాడు భావనారాయణ.

రుక్మిణి మూతి తిప్పింది.

“అంతేలెండి. కూతురు మీద ఉన్న ప్రేమలో వందో వంతు లేదు నా మీద. ఎంతసేపూ కూతురికి అది కావాలి, ఇది కావాలి అని తెస్తుంటారు. సంతోషపెట్టాలని చూస్తుంటారు. నేను ఏది అడిగినా చూద్దాం... చేద్దాం అని దాటవేస్తుంటారు. మీకు నా సేవలు కావాలి గానీ, నా కోరికలు పట్టవు” నిష్ఠూరంగా అన్నది.

“ఛ..ఛ...ఎందుకంత ఫీలవుతావు? నేను నీకేం తక్కువ చేస్తున్నాను”

“అన్నీ ఎక్కువే చేస్తున్నారు.”

“సరే..సరే... లుంబినీ పార్కుకి తీసుకెళ్తాను. హేపీనా?” అని ఆమెకు చక్కలిగింతలు పెట్టాడు.

రుక్మిణి నవ్వింది.

○○○

భావనారాయణ ఐస్‌క్రీమ్ కప్పు రుక్మిణికి అందించాడు. లాన్‌లో కూర్చుని ఇద్దరూ ఐస్‌క్రీమ్ తినసాగారు.

“ఇలా పచ్చగడ్డిలో కూర్చుని ఐస్‌క్రీమ్ తింటుంటే, చిన్నపిల్లనైపోయినట్లు ఫీలింగ్ కలుగుతుందండీ” సంతోషంతో అన్నది రుక్మిణి.

“ఐతే నీకిప్పుడు స్వీట్ సిక్స్‌టీన్ అన్నమాట.” అని నవ్వాడు భావనారాయణ.

ఇద్దరూ నవ్వుకుంటున్నారు.

అరుణ వాళ్లిద్దరినీ తదేకంగా చూస్తోంది. ఆయన తన డాడీయేనా? తన డాడీ పక్కనే ఆమె ఎవరు? ఎప్పుడూ చూళ్లేదే? అరుణకు చాలా ఆశ్చర్యంగా ఉంది. తమ చుట్టాలంతా తనకు తెలుసు. ఆమె ఖచ్చితంగా చుట్టం కాదు. మరి ఎవరు? డాడీ ఆఫీసులో పనిచేసే ఆంటీ ఏమో?


అరుణ ఆలోచిస్తోంది. తను ఇప్పుడు వెళ్లి డాడీని పలకరించాలా? వద్దా?

“అరుణా! వాటార్యూ డూయింగ్ హియర్?” వార్డెన్ అరుస్తోంది.

అరుణ ఉలిక్కిపడింది. వార్డెన్ అరుణ భుజం మీద చెయ్యి వేసింది.

"ఎవర్ని అలా చూస్తున్నావు?" అని ఆమె భావనా రాయణ, రుక్మిణిలను చూపించింది.

"ఆయన మీ డాడీ కదూ!"



తల ఊపింది అరుణ.

"ఆమె ఎవరు?"

"ఏమో?" అన్నది అరుణ.

"నీకు తెలీదా?"

"ఎప్పుడూ చూళ్లేదు." చెప్పింది అరుణ.

"మీ మమ్మీ చనిపోయింది కదా?"

అరుణ తలవంచుకుంది. ఆమె కళ్లల్లో నీళ్లు తిరి గాయి. తల్లి జ్ఞాపకం వచ్చింది. తనను నిద్ర లేపి, పళ్లు తోమించి, స్నానం చేయించి, రెండు జడలు వేసి డ్రెస్ వేసేది. తనకు ఇష్టమైనవి వండి పెట్టేది. తనని ఎప్పుడూ కొట్టేది కాదు. షాపింగ్‌కి తీసుకెళ్లి తనకి మంచి డ్రెస్‌లు కొనిపెట్టేది. ఐస్‌క్రీమ్‌లు, చిప్స్ కొనిచ్చేది. ఎంత మంచి మమ్మీ!

అరుణ తల వంచుకుని కన్నీళ్లు తుడుచుకుంది.

"నో..నో..! డోంట్‌వర్రీ మై బేబీ..." వార్డెన్ అరుణను హత్తుకుని ఓదార్చింది.

"డాడీ మళ్లీ పెళ్లి చేసుకోవచ్చా మామ్?" అడిగింది అరుణ.


"చేసుకోవచ్చా ఏమిటి? చేసుకోవాలి. నీకొక అమ్మ ఉంటే ఇట్లా నిన్ను హాస్టల్లో చేర్పించే అవసరం ఉండేది కాదు. చిన్న వయసులో నీకు ఒంటరిగా ఉండాల్సిన అవసరం ఉండదు కదా!" అన్నది వార్డెన్.

భావనారాయణ, రుక్మిణి చేతులు పట్టుకుని ఊపుకుంటూ బోట్ ఎక్కడానికి వెళ్లిపోయారు.

"డాడీ దగ్గరికి వెళ్తావా?" అడిగింది వార్డెన్.

అరుణ తల అడ్డంగా ఊపింది.

ooo



ఆ తర్వాత ఆదివారం అరుణను ఇంటికి తీసుకొచ్చాడు భావనారాయణ. సీత నేతి పెసరట్లు కాల్చి వాటి మీద అల్లంముక్కలు, పచ్చిమిర్చి, జీలకర్ర చల్లి వేడివేడిగా వడ్డిస్తుంటే ఇష్టంగా తిన్నది అరుణ.

ఉదయమే రుక్మిణి వెళ్లే ముందు పెసరపప్పు మిక్సీలో వేసి, అల్లం, పచ్చిమిర్చి సన్నటి ముక్కలుగా తరిగిపోతుంది కాబట్టి పెసరట్లు వేసి ఇవ్వడం సీతకి కష్టం కాదు.

బోర్నవీటా తాగిన తర్వాత "సీతా! ఈవెనింగ్ మినపగారెలు, సేమ్యా పాయసం చెయ్యి. ఏం?" అన్నది అరుణ.

సీత గుండెల్లో రాయి పడింది.

ప్రతి ఆదివారం తండ్రీ, కూతుళ్లు మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ కూడా ఏ హోటల్లోనో చేసి వస్తారు. లేదంటే భావనారాయణ పార్సిల్ పట్టుకొస్తాడు.

అసహాయంగా భావనారాయణ వంక చూసింది సీత. రుక్మిణి విషయం పొరపాటున గూడా అరుణకు తెలియగూడదని స్ట్రిక్ట్‌గా సీతకి చెప్పి ఉంచాడు. ఒకసారి ఉదయం గారెల పిండి రెడీ చేసి, పాయసం వండి వెళ్లింది రుక్మిణి. అరుణ వచ్చిన తర్వాత గారెలు వండిపెట్టింది సీత.

సీత అవస్థ గమనించిన భావ నారాయణ, "ఎందుకు లేమ్మా! మనం ఈవెనింగ్ ఐమాక్స్‌లో సినిమాకెళ్దాం. రెస్టారెంట్‌లో పిజ్జా తిందువుగానిలే." అన్నాడు.

"పిజ్జా తిని తిని విసుగ్గా ఉంది డాడీ! గారెలు తినాలనిపిస్తుంది. అప్పుడెప్పుడో ఒకసారి సీత చేసిన పాయసం వండ్రఫుల్ డాడీ." అన్నది అరుణ.

"అరుణమ్మా! గారెలు చెయ్యాలంటే మినపప్పు నానబెట్టాలి. మిక్సీలో వేస్తే రుచిగా ఉండదు. గ్రైండర్ పనిచేయడం లేదమ్మా!" అన్నది సీత.

అరుణ పకపకా నవ్వింది.

"మినప్పప్పు నానబెట్టు. పక్కవీధిలో పప్పు రుబ్బుతారు గదా! రుబ్బించుకురా! ప్రాబ్లమ్ ఏముంది?" అన్నది.

సీతకి తప్పలేదు. మినపప్పు నానబెట్టి రుబ్బించుకు రావడానికి వెళ్లింది. గారెల కమ్మా అని చెప్తే వాళ్లు వేసి ఇచ్చారు. సాయంకాలం ఎలాగో గారెలు వేసిపెట్టింది. కానీ పిండిలో ఉప్పు వేయడం మర్చిపోయింది. చప్పగా ఉన్నాయి. ఎలాగో ఆవకాయ పచ్చడి నంజుకుని తిన్నది.

ఇక పాయసం తినలేక పారబోసింది అరుణ.

సీతని ఒంటరిగా పట్టుకుని "సీతా! పెసరట్లు, గారెలు పాయసం నువ్వు చేయడం

లేదు కదూ!" అని అడిగింది అరుణ.

"అదేంటమ్మా? మీ ముందే కదా చేస్తున్నాను" ఇబ్బంది పడుతూ చెప్పింది సీత.

"మరి చండాలంగా చేశావేం ఈసారి?"

"ఒక్కోసారి కుదరదమ్మా!" అన్నది సీత.

అరుణ నవ్వి ఊరుకుంది. ఆమెకు నిజం తెలిసిపోయిందేమోనని భయపడింది సీత.

"ఇటువంటివి ఎన్నాళ్లు దాగుతాయి? ఏదొక రోజున బైటపడాల్సిందే!" అనుకుని నిట్టూర్చింది సీత.

○○○

ప్రతీ ఆదివారం హాస్టల్‌కి వెళ్లి అరుణను తీసుకొచ్చి, సోమవారం ఉదయమే తీసుకెళ్లి వదిలేస్తుంటాడు భావనారాయణ.

సోమవారం ఉదయం భావనారాయణ వాకింగ్‌కి వెళ్లి వచ్చేసరికి అరుణ ఇంకా నిద్ర లేవలేదు. అతను కంగారుపడ్డాడు. నిద్ర పోతున్న కూతురు దగ్గరికి వెళ్లి నుదుటిమీద చెయ్యి వేసి చూశాడు. మామూలుగానే ఉంది.

"హమ్మయ్య! ఫీవర్ ఏమీ లేదు" అని నిట్టూర్చాడు.

అరుణ కళ్లు తెరచి, "డాడీ! నాకు తలనెప్పిగా ఉంది. ఎందుకో నీరసంగా ఉంది. రాత్రి మనం చూసిన మూవీ అస్సలు బాగా లేదు. ఎప్పుడైపోతుందా? ఇంటికెళ్లిపోదామా అనిపించింది. అందువల్ల అనుకుంటాను" అన్నది.

"ఔను. పెద్ద స్టార్లున్నారని వెళ్లాం. చండాలంగా ఉంది" అన్నాడు.

"ఈరోజు నేను రానని మా వార్డెన్‌కి ఫోన్ చేసి చెప్పుడాడీ. నేను చెప్తే నమ్మదు."

"ఓ.కే... నేను చెప్తాలే. నువ్వు రెస్ట్ తీసుకో" అన్నాడు.

సీతకి ఎన్నో జాగ్రత్తలు చెప్పి ఆఫీసుకి వెళ్లాడు భావనారాయణ.

తండ్రి ఆఫీసుకి వెళ్లిన తర్వాత అరుణ డ్రెస్ ఛేంజ్ చేసుకుంది.

"ఎక్కడకి అమ్మాయిగారూ?" అని సీత ఆశ్చర్యంగా అడిగింది.

"నువ్వు గూడా నాతో పాటు పద ఇంటికి తాళం వెయ్యి" అన్నది అరుణ.

"నేనా! ఎక్కడికమ్మా?"

"సినిమాకెళ్దాం."

"రాత్రే కదండీ ఎళ్లారూ?"

"అదంతా నీకెందుకు? నోర్మూసుకుని పద" అన్నది అరుణ కోపంగా.

సీత ఇంటికి తాళం వేసి అరుణతో పాటు బయల్దేరింది.

"ఏ సినిమాకమ్మాయిగారో?"

"ఆవిడ ఇల్లెక్కడ?"

"అదేం సినిమానండీ?"

"రోజూ ఇంట్లో నడుస్తున్న సినిమా?"

సీత భయంగా చూసింది. రుక్మిణి వ్యవహారం అరుణకు తెలిసిపోయిందని అర్థమైంది.

"చెప్పు? ఆవిడ ఎక్కడుంటుంది?"

"ఆవిడెవరండీ?"

"నోర్మూసుకుని ఆవిడ ఎక్కడుంటుందో పద."

"అమ్మాయిగారూ!"

"నాకంతా తెలుసు. చెప్పు"

"అమ్మో! అయ్యగారు చంపేస్తారు"

"నువ్వు చెప్పకపోతే నేను ఏ కారుకిందో పడి చచ్చిపోతా!" అని అరుణ రోడ్డు మీద పరిగెత్తింది.

సీత గట్టిగా పరిగెత్తి అరుణను పట్టుకుంది.

"ఎందుకు అంత భయపడతావ్? డాడీ నిన్నేం చేస్తాడు? మహా ఐతే పనిలో నుంచి తీసేస్తాడు. అంతేగా! ఈ పని ఇంకొక చోట దొరకదా?" తీవ్రంగా అన్నది అరుణ.

సీతకి తప్పలేదు.

○○○

కాలింగ్‌బెల్ కొట్టింది అరుణ.

రుక్మిణి తలుపు తీసింది.

ఎదురుగా అరుణ. షాక్ తిన్నట్లయిపోయింది. అరుణను ప్రత్యక్షంగా చూడకపోయినా గుర్తుపట్టింది రుక్మిణి. ఫోటో ఆల్బమ్స్, బర్త్ డే సీడీల్లో చాలాసార్లు చూసింది.

అరుణ రుక్మిణిని ఎగాదిగా చూసింది.

"ఎవరు కావాలి?" అడిగింది రుక్మిణి.

"అమ్మ కావాలి." చెప్పింది అరుణ.

"అమ్మా! మీ అమ్మ ఇక్కడెందుకు ఉంది?"

"ఇక్కడే ఉంది."

"ఎక్కడ?"

"నా ఎదురుగా ఉన్నది."

రుక్మిణి. మాటలు రాక తలవంచుకుంది.

"ఎందుకమ్మా ప్రతీ ఆదివారం నేను వచ్చేసరికి నువ్వు వెళ్లిపోతున్నావు?"

రుక్మిణికి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"నేనంటే ఇష్టం లేదా?"

"నీకెవరు చెప్పారమ్మా అలా అని."

"మరి ఎందుకు వెళ్లిపోతున్నావు?"

"నీకు తెలియగూడదని మీ నాన్నగారు..."

"అమ్మా! నాకు అన్నీ తెలుసు. నాన్న నిన్ను రిజిష్టర్ మ్యారేజి చేసుకున్నాడు. ఎందుకో నా నుంచి రహస్యంగా ఉంచాడు. నేను మరీ చిన్న పిల్లను కానమ్మా! కానీ నాకు అమ్మ కావాలి."

అరుణ దగ్గరగా వెళ్లి రుక్మిణిని కౌగిలించుకుంది. రుక్మిణి అరుణను తన హృదయానికి హత్తుకుంది. ○



## ముద్దాడితే తప్పేంటి?

అతిగా ఎక్స్‌పోజింగ్ చేయని స్టార్‌లా కనిపించే విద్యాబాలన్ లాంటి తార 'ముద్దాడితే తప్పేంటి?' అని ప్రశ్నిస్తే ఎవరు మాత్రం ఆశ్చర్యపోరు చెప్పండి. మణిరత్నం సినిమా 'గురు'లో మాధవన్‌ని ఎంచక్కా ముద్దాడి ప్రేక్షకుల్ని విస్మయపరిచిన విద్యాబాలన్ భవిష్యత్తులో వేరే హీరోలతో కూడా ముద్దు సన్నివేశంలో నటించడానికి పెద్దగా అభ్యంతరాలు లేవని తాజాగా సెలవిచ్చింది. దర్శకుడు, సినిమా ఇతివృత్తం, సన్నివేశం.. వీటన్నిటి ప్రాధాన్యతని బట్టి కిస్సింగ్ సీన్‌లో నటించడానికి రెడీ అంటోంది విద్య. ఇదో పబ్లిసిటీ స్టంట్ కాదు కదా!